
# నేనూ కథరాశాను



= రచన: శ్రీ గుంటపల్లి వెంకటరమణ =

"ఏవండీ! ఏవండోయ్... అబ్బబ్బ... కుంభకర్ణుడైనా లేపొచ్చేమో గాని మిమ్మల్ని లేపలేనండి." అంటూ మాఆవిడ అరచే అరుపులకు తెలివచ్చింది.

"అరగంటనుంచి లేపుతూంటే ఇప్పటికి లేచావా చిట్టి తండ్రీ?" అంటూ నిట్టూర్పు విడిచిన బొమ్మలా ఆరుగంటలు కొట్టింది, మా క్రొత్త యింట్లోని పాత గడియారం.

"ఏవండీ! రేపు చాలా అర్జంట్ పని ఉంది అయిదు గంటలకల్లా లేపేయ్ అన్నారు. ఎంత లేపినా లేవరేమండి?' అంది పద్మ. అప్పుడు గుర్తుకొచ్చినయ్ రాజు మాటలు.

"ఓకేయ్ రమణా! కథాంజలికి కథ రాస్తానన్నావు మరెంతో టైమ్ లేదోయ్. రెండు రోజులలో పంపేయ్యాలి. రేపు ఎలాగయినా పూర్తి చేసేయ్" అన్నాడు రాజు.

రాజు కథలు చాలా పత్రికలలో పడినయ్. రాజులాంటి మంచి రచయిత స్నేహితుడుగా ఉండటం మా మిత్రబృందానికి ఎంతో గర్వం.

"నన్ను చూసి గర్వపడటం కాదోయ్, నువ్వుకూడా కథలు రాయడం నేర్చుకో" అన్నాడు రాజు ఒకనాడు.

అప్పట్నించి నేను రాజులా మంచిపేరు తెచ్చుకోవాలని దురాలోచనే అనండి, సదాలోచనే అనండి ఒకటి కలిగింది. దేనిమీద కథ రాయడం అన్న ప్రశ్న ఎదురయింది. రాజునడిగితే ఇంత విశాల ప్రపంచం, కోటాన కోట్ల జనాభా, విడిచిపెట్టి దేనిమీద అంటావేంరా?" ఏది ఏమయినా ఈవేళ ఏదో ఒక దానిమీద కథ రాసేయ్యాలని నిన్న ఏం భాగం చూచి, ఈ వేళంతా చాలా శుభప్రదమని ఉదయము ఆరుగంటలకే లేచి స్నానం ముగించి ఆ ఏడుకొండలవాడికి రోజుకంటే పదినిముషాలు ఎక్కువ సేపు ధ్యానించాను. (నా పేరు కూడా వెంకట రమణే కనుక).

నా భక్తికి మెచ్చి మా ఆవిడ మురిసిపోతూ వలపులు చిలుకుతున్న వేడి కాఫీ అందించింది.

కాఫీ త్రాగి, "పద్మా! ఈవేళ ఆఫీసువర్క్ చాలా ఉంది నా గదిలో కూర్చుని చేసుకొం

టాను నన్ను డిస్ట్రబ్ చేయకు'' అన్నాను. (కథలు రాయడం మొదలు పెడుతున్నానంటే కాగితాలు తగలెడుతున్నానని తిట్టిపోస్తుంది)

ఒకనాడు ఖర్మం చాలక కథ రాద్దామనుకుంటున్నానే అన్నాను పద్మతో.

''అహాహ...చాకలాడి పద్దు రాయలేరుగాని కథలు రాస్తారట ఎంత ఉండాలండి కథలు రాయడానికి'' అంది పరిహాసంగా. నాకయితే రాయాలనే ఉంది గాని, మా ఆవిడ పేరు ఎత్తేసరికి మొదలే కంచికి వెళ్ళుతుంది కథ.

నిన్ననే మా ఆవిడకి తెలీకుండా కొన్ని దస్తా కాగితాలు పైకి తీసాను. పెన్ను నిండా ఇంకు నింపి రేడీగా కూర్చున్నాను. ట్రాజడీ రాస్తే బాగుంటుందా! కామెడీ రాస్తే బాగుంటుందా!! హ్యూమరస్‌గా ఉంటేనే అంతా లైక్ చేస్తారు. ఎవరో వ్రాసిన పాత కథలు నా మెదడులో దొర్లుతున్నాయ్. ఇలాగే గాబోలు మూడ్సు వస్తాయి. పాత మూడ్సుతోనే క్రొత్త కథ రాయాలేమో.

ఆ!! స్ట్రైకయింది. రాయడం మొదలెట్టాను.

'—అప్పల నరసయ్యకి ఆ రోజు క్లాసులో పాఠం అర్థం కాకపోవటానికి కారణం సీతే. ఎంత తమాయించుకున్నా, నిన్న సాయంత్రం బీచ్‌లో వోరగా తనవైపు చూచి నవ్విన చిరునవ్వు గిరిలాగ పెరికి అప్పల నరసయ్యని ముంచేసింది. ఆ నవ్వుకే అప్పల నరసయ్య, సీత తనని ప్రేమించేసిందనుకొన్నాడు.—'

''ఏమండోయ్! అలా బజారుకెళ్ళి కూరలేమయినా ఉంటే పట్రండి వీధిలోకి ఏమీ రాలేదు'' అంటూ ప్రవేశించింది పానకంలో పుడకలా పద్మ.

ఈడ్చి తందామన్నంత కోపం వచ్చింది గాని తరువాత నా కాలు చెయ్యి సరిగ్గా ఆడతాయో లేదో అని ఊరుకొన్నాను. ఆ బంగారంలాంటి మూడ్ కాస్త బెదిరి పారిపోయింది.

మా ఆవిడకి తెలీకుండా కాగితాలు దాచి సంచిపట్టుకొని బజార్న పడ్డాను.

ఏలాగయినా ఈ రోజు కథ రాసేయ్యాలనే పట్టుదల ఎక్కువయిపోయింది నాకు.

ఎప్పుడు బజారుకు వెళ్ళినా! కనీసం రెండు గంటలు టైమ్ తీసుకొనే నేను ముప్పావు గంటలో బజారు ముగించి గబగబా ఇంటి చేరే సరికి గుమ్మంలోనే ''అర్జంట్‌గా రమ్మంటున్నారు దొరగారు'' అంటూ ఆఫీసు నుండి పిడుగులాంటి వార్త వ్రాసుకొచ్చాడు ప్యూను అప్పలస్వామి.

వారానికి ఒక్క రోజు కూడా సెలవు దొరకని ఉద్యోగాన్ని తిట్టుకుంటూ ఆదరాబాదరా సంచి ఇంట్లో పారేసి బయలు దేరాను ఆఫీసుకు.

తిండి తిప్పలు లేకుండా సాయంత్రం అయిదు గంటలవరకు పనిచేసి, సాయంత్రమయినా షికారుకెళ్ళకుండా ఇంట్లో కూర్చుని కథ రాసేయ్యాలని త్వర త్వరగా నడవ సాగాను. ఎంత తలవంచుకొని నడుస్తున్నా

"ఒరేయ్ రవణా!" అన్న పిలుపు వినబడే సరికి ఆగక తప్పింది కాదు.

"రవణారావు! ఈవేళ క్రికెట్ స్కోరు విన్నావా! బ్రహ్మాండంగా ఉంది కదూ..." క్రికెట్ పిచ్చి భగవాన్లు సోది మొదలెట్టాడు. ఎవడిపిచ్చి వాడికి ఆనందం అంటారు. ఇందుకే నాకు క్రికెట్ అంటే పడదు అతనికి సాహిత్యమంటే పడదు. అందుకే రాజు చెప్పిన అస్త్రం ప్రయోగించాను. "ఓరేయ్ భగవాన్లు ఇది విన్నావు... మొన్న ఒక కథ పడింది పత్రికలో. నీవు చదివావా బ్రహ్మాండంగా ఉందనుకో... నేనింకా' పూర్తి చేయకుండానే—

"స్కోరు బిగ్గీ అవుతుంది నే వస్తానోయ్ తర్వాత కలుద్దాము" అంటు జారుకొన్నాడు. నవ్వుకుంటూ ఇల్లు చేరుకున్నాను.

తిండీ తిప్పలు మా ఆవిడ ప్రశ్నలకి జవాబులు పూర్తి అయ్యేసరికి 8 గంటలయింది. నా గదిలోకి పోయి కాగితాలు పెన్ను పైకి తీశాను. ఉదయం రాసింది మళ్లీ ఇప్పుడు చదివేసరికి నాకే వెగటనిపించి చించి పారేసాను. మరో అరగంట ఆలోచించేసరికి నేను కాలేజిలో చదివే రోజులలో జరిగిన సంఘటనలు రాద్దామనిపించింది. వెంటనే మొదలెట్టాను.

ప్రియమైన కస్తూరి,—

నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నా ప్రేమను నీవు అర్థము చేసుకొనలేకపోవుచున్నావు. నన్ను ఎందుకు ఇంత నిరసనగా చూస్తున్నావు కస్తూరీ! నువ్వులేని జీవితం వ్యర్థం. నీకిష్టమయితే నిన్ను నా జీవిత భాగస్వామిగా చేసుకోవాలనుకొంటున్నాను. మల్లెపువ్వులాంటి నీ చిరునవ్వు చూస్తే నా శరీరం తీయని బాధతో నిండి పోతుంది కస్తూరీ!

ఈ ఉత్తరంకయినా జవాబు యిస్తావు కదూ?

ఇట్లు,
నీ...

—యింకా రాద్దామనుకొంటుండగా ఎంతసేపయి వచ్చి నా వెనక నిలబడిందో పద్మ కంఠం కందు మంది.

'ఆఫీసు పని ఉందని చెప్పి మీరు వెలగబెడుతుంది ఇదా? ఎవరండీ? ఆ కస్తూరీ?'

ఇదేం పాడుబుద్ధులండీ మీకు. నన్ను అన్యాయం చేస్తారా? అంత యిష్టం కాకపోతే నన్ను పెళ్ళాడ్డం మానేయలేకపోయారు..."

దాదాపు ఏడుపు లంకించుకుంది... పమిట చెంగుతో కళ్ళు తుడ్చుకుంటూ.

"అది కాదు పద్మా అసలు కస్తూరి ఎవరో నాకు...

'ఇంకాపండి. మీకల్ల బొల్లి మాటలు మరినమ్మేది కాదు.'

"ఆ కస్తూరి ఎవరో తెలిసేవరకు మీతో మాట్లాడ్ను. నన్ను మా పుట్టింటికి పంపెయ్యండి."

"ఇదేం కర్మరా భగవంతుడా నా కథ సాగేటట్లు లేదు ఇన్ని అవాంతరాలతో రాజు

(తరువాయి 82వ పేజీలో)

ఏదైనా సుఖాంత నాటకంలో మూర్ఖునిదే కఠినమైన భూమిక. నటించేవాడు మూర్ఖుడు కాకుండా వుండాలి.

—సర్వాంటిస్.

హాజరు కాకపోవడంలో హృదయ జిజ్ఞాస మరింత అధికమాతుంటుంది.

—థామస్ బేలీ.

ఎవరైనా సరే హాజరు కాని వ్యక్తిమీద నిందమోపడానికి సంసిద్ధులవరాదు.

—ప్రాపర్టియస్.

ఎగిరేటప్పుడే మిణుగురుపురుగు మెరుస్తుంటుంది. దీనిలాగే మనస్సుకూడా. మనం ఆగిపోయే సరికి అంధకారం అలముకొంటుంది.

—బేలీ.

జీవితంలోని అపజయాలు సద్గుణాలవల్ల వంచించబడుతాయి.

—గాంధి.

ఉజ్వల మానవత్వం కోసం సంచితమైన యావన నిఘంటువులో 'అపజయం' అన్న పదం ఎన్నడూ వుండదు.

—బుల్వర్ లిటన్.

నదిలోని ఒక ఒడ్డు నిశ్వాసం తీస్తూ అంటోంది-''సుఖం అంతా అవతలి ఒడ్డుమీదనే వుంది.'' రెండో ఒడ్డు నిట్టూర్పుతో-''ప్రపంచంలోని సుఖం అంతా ఆవతలి ఒడ్డుమీదనే వుంది.''

—రవీంద్రుడు.

పరాజయానికి మారుపేరు అసంతోషం.

—బీరజీ.

అసంతుష్టుడికి కర్తవ్యమంతా నీరసంగా వుంటుంది. ఏ వస్తువూ అతన్ని సంతోషపరచ లేదు. అందుచేత అతని జీవితం అపజయాల పాలవుతుంది.

—వివేకానంద.

(76వ పేజీ తరువాయి)

ఎలా రాసున్నాడో. కాగితాలు కలం పక్కన పెట్టి పద్మని ఊరడించటంతో మిగతా రాత్రంతా గడిచిపోయింది. పద్మ అలక పొన్నుదిగక పోవటంవలన కాఫీ పెట్టుకు తాగి ఆఫీసుకు బయలుదేరాను. అప్పుడే వచ్చిన రాజు 'ఏమోయ్ కథ పూర్తయిందా! అని అడిగాడు.

జరిగిందంతా చెప్పి 'రాజు అసలు నేను కాలేజిలో చదివే రోజులలో సుబ్బారావనే స్నేహితుడుండేవాడు అతడంటే యిష్టంలేని అమ్మాయిని ప్రేమించి, ప్రేమలేఖలు వ్రాసి చివరకు ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకొన్నాడు. వారి ప్రేమ వ్యవహారం కథగా రాద్దామనుకొన్నాను. సుబ్బారావు కస్తూరికి రాసిన ప్రేమలేఖతో కథ మొదలెట్టాను. అది చూచి మా ఆవిడ నన్ను అపార్థం చేసుకొంది. దానితో ఆ కథ అక్కడితో పూర్తి అయిపోయింది' అంటూ వివరించాను. నేను చెప్పిదంతా శ్రద్ధగా విన్న రాజు నవ్వుతూ 'వేరే కథ రాయడం ఎందుకోయ్ ఈరోజు నీ కార్యక్రమం అంతా జాగ్రత్తగా వ్రాసేయ్ అదే కథ' అంటూ అప్పటికప్పుడు రాయించేసాడు నా కథ.

మా ఆవిడకి తెలియకుండా వ్రాసిన ఈ కథ ప్రచురిస్తే నేను కథ రాసేనేవ్ ఇదిగో ప్రచురింపబడిందని నా పద్మకి చూపెడతాను. అప్పటికయినా కస్తూరి ఎవరో నమ్ముతుందేమో.